# అసమాన అనసూయ

## ( నా గురించి నేనే )



“కళా ప్రపూర్ణ”

డా. అవసరాల (వింజమూరి) అనసూయా దేవి

# "అసమాన అనసూయ"

(నా గురించి నేనే)

'కళా ప్రపూర్ణ'

**డా. అవసరాల (వింజమూరి) అనసూయా దేవి**

**60వ ప్రచురణ**

**Vanguri Foundation of America, Inc,**

Houston, Texas

**‘అసమాన అనసూయ”** (నా గురించి నేనే)

by “Kala Prapurna” Dr. Avasarala (Vinjamuri) Anasuya Devi

First Edition: December, 2015

ISBN: 1-892408-52-X

Publication # 60

© Author

Copies: 500 Price: Rs. 250

Tax Deductible Donation: US$ 35.00 U.S Federal tax ID: 76-0444238

*Published by:*
**Vanguri Foundation of America (Houston, TX)**
PO Box 1948, Stafford, TX 77497
Phone: 832 594 9054, Email: vangurifoundation@gmail.com

**Vanguri Foundation of America (Hyderabad)**
Satya Sai Puram, Kuntloor (Village), Hyderabad - 501 505 Ph: 98490 23852

For Copies (US, India & other countries):
vangurifoundation@gmail.com

**Navodaya Book House,** Opp. Arya SamajMandir, BadiChowdi, Hyderabad.

**Telugu Book House**: Ph: 92474 46497

All Major Book Shops

Designed &Publishing:
**Jyothivalaboju**
E-mail:jyothivalaboju@gmail.com... Phone: 80963 10140

DTP & Type Setting: **K. Ravi Prabha**, Cell: 96666 08835

*Printed at:*
**Karshak Art Printers,** Vidyanagar, Hyd.44

Sole distributors :
**Sai Venkata Ramana Book Distributors,**
Gandhi Nagar, Hyderabad. Ph: 9676799500

# ముందు మాట

**మా** చిన్నప్పుడు పాటలు విని తల ఊపుతూ ఆనందించడం అందరికీ అలవాటు. ఇప్పటిలాగా పాట మొదలవగానే లేచి గెంతులేసి ఆనందిస్తున్నాం అనుకోడం ఆ రోజుల్లో రౌడీల లక్షణం. నాకు పాటలు విని ఆనందించే వయస్సు వచ్చిన దగ్గర నుంచీ ఈనాటి వరకూ ఇంకా ఉర్రూతలూగిస్తున్న ఏకైక స్వరం అనసూయగారిదే. మేనమామ దేవులపల్లివారి 'జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి', కొనకళ్ళవారి 'మొక్కజొన్న తోటలో', 'నోమీన మల్లాల', అప్పటికి అముద్రితాలైన నండూరివారి ఎంకి పాటలు, గురజాడవారి ముత్యాల సరాలు, శ్రీశ్రీగారి మహాప్రస్థానం, రాయప్రోలువారి దేశభక్తి గీతాలు... ఒకటేమిటి కొన్ని వేల పాటలకి తొలిసారిగా స్వరాలు కట్టి తన అసమాన స్వరంతో శాస్త్రీయ సంగీత స్థాయిలో పూర్తి కచేరీలు చేసిన తొలి తెలుగు గాయని అసమాన అనసూయ గారే! తెలుగు సంగీత చరిత్రలో ఇప్పుడు లలిత సంగీతం అని పిలవబడుతున్న భావగీతాలకి ఆద్యురాలై, బ్రిటిష్‌వారి రోజులలోనే దేశభక్తి గీతాలని నిర్భయంగా పాడి, అంతవరకూ 'కామెడీ పాటలు' అని పిలవబడుతున్న పాటలకి జానపద గేయాలుగా ప్రచారం చేసి, సభా గౌరవం కలిగించిన తొలి గాయని అసమాన గాయని అనసూయాదేవిగారే! అంతెందుకు, ఈనాడు తెలుగునాట ఏ సినిమాలో కానీ, పాటల కార్యక్రమాలలో కానీ ఎటువంటి జానపద బాణీ వినిపించినా, దాని మూలాలు అనసూయాదేవిగారు దశాబ్దాల పాటు మారుమూల ప్రాంతాలు తిరిగి సేకరించి, బాణీ కట్టి పాడినదే అని నిస్సందేహగా చెప్పవచ్చును.

అంతకు ముందు నేను ఆవిడ వేదికల మీద పాడడం విన్నా, వ్యక్తిగత పరిచయం మటుకు 1977లోనే. అప్పటినుంచి ఇప్పటివరకూ ఆవిడ నన్ను పుత్ర సమానుడిగానే అభిమానంతో ఆదరించారు. 1977లో నేనూ, ఆవిడ పెద్దల్లుడు అనిల్ కుమార్ (సుప్రసిద్ధ నర్తకి రత్నపాప భర్త) కలిసి అమెరికాలో అనసూయ-సీత 'మన పల్లెపదాలు' అనే తొలి తెలుగు గ్రామఫోన్ రికార్డు ప్రొడ్యూస్ చేశాం. అమెరికాలో ఆవిడ కచేరీలు అనేకం ఏర్పాటుచేసే అదృష్టం కూడా నాకు కలిగింది. 1980లో మా తమ్ముడు హనుమంతరావు పెళ్ళికి ప్రత్యేకం కాకినాడ

వచ్చి అనసూయగారు చెల్లెలు సీతగారితో కలిసి కచేరీ చేశారు. అంతటితో ఆగలేదు మా సాంగత్యం. నా మాట కాదనలేక ఆవిడ కొన్ని కథలూ, జానపద గేయాల మీదా, భావగీతాల మీదా, తన జీవితానుభాల మీదా వ్రాసిన రచనలన్నీ 2003 లో ‘నేనూ–నా రచనలూ’ అనే పుస్తకం వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి 22వ ప్రచురణగా ముద్రించాం. అప్పటివరకూ ఆవిడ వ్రాసిన 8 పుస్తకాలూ సంగీత పరమైనవే. ఆ తరువాత ‘గతానికి స్వాగతం’, ‘ఎందరో మహానుభావులు’ పుస్తకాలు కూడా బాగా ఆదరణ పొందాయి. అనేక సంవత్సరాలుగా మేము నిర్వహించిన అనేక సాహిత్య కార్యక్రమాలకి ఆమె ముఖ్య అతిథిగా రావడం ఒక ఎత్తు అయితే 2009 లో ‘రెండవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు’లో అనసూయాదేవి గారికి ‘జీవన సాఫల్య పురస్కారం’ ఇచ్చి మాకు మేమే గౌరవం చేసుకునే అదృష్టం కూడా దక్కింది.

ప్రస్తుత విషయానికి వస్తే సుమారు ఏడాదినుంచీ ఆవిడని ఎప్పుడు కలుసుకున్నా, మాట్లాడినా తన సుదీర్ఘ జీవిత ప్రస్థానంలో సాధించిన విజయాలు, అనుభవించి, అధిగమించిన కష్టనష్టాలూ అందరికీ మార్గదర్శకంగా ఉండే ఆత్మ కథ వ్రాయమని బతిమాలి, అప్పుడప్పుడు కోప్పడుతూ వచ్చాను. నా మాట మన్నించి ఏకధాటీగా తన ఐదవ ఏటి తొలి జ్ఞాపకాల నుంచీ నిన్న మొన్నటి అనుభవాల దాకా ఏకంగా 90 ఏళ్ల జీవితాన్ని అసమానమైన జ్ఞాపకశక్తితో ఆవిడ రెండు నోట్ పుస్తకాలలో వ్రాశారు. అదంతా నాకు అందించడం ఎలాగా అనుకుంటున్న సమయంలో కేలిఫోర్నియాలో మన బడిలో ఉపాధ్యాయుడైన సుభాష్ అనే యువకుడు అనుకోకుండా ఆవిడకీ, నాకూ పరిచయం అయ్యాడు. అతను వృత్తిపరంగా ఒక కంప్యూటర్ కంపెనీకి డైరెక్టరే అయినా ప్రవృత్తిపరంగా సాంస్కృతికాభిమాని. అనసూయగారి సంగీతాభిమాని. అతను మా పుస్తక ప్రణాళిక గురించి వినగానే అనేక వారాలు రోజూ ఆవిడని కలుసుకుని, ఆమె చేతివ్రాతలో ఉన్న ఆత్మకథనీ, ఫోటోలనీ కంప్యూటర్‌లోకి నిక్షేపించి, నాకు అందించి ఎనలేని సహాయం చేశాడు. అతని సహకారానికీ, సహృదయానికీ నా ధన్యవాదాలు.

ఈ సజీవ జీవనయానం ఒక వ్యక్తి చరిత్ర మాత్రమే కాదు. 90 సంవత్సరాల తెలుగు సంగీత చరిత్ర. అందులో ప్రతీ మలుపులోనూ అనసూయగారు నిర్వహించిన అసమానమైన పాత్రకి దర్పణం. ఆమె వ్యక్తిగత జీవితానుభావాల రంగరింపు. ఆరు తరాల సుదీర్ఘ మైన, సుసంపన్నమైన తెలుగు సంగీత, సాహిత్య,

వ్యక్తిగత జీవితం, ఫోటోలు, ఆమె సేకరించిన ప్రముఖుల ఆటోగ్రాఫులూ అన్నింటినీ, సంగ్రహంగా అనిపించినా సమగ్రంగానే 'అసమాన అనసూయ' అనే ఈ అపురూపమైన, చారిత్రక ప్రచురణకి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారి ఆదరణ లభిస్తుంది అని ఆశిస్తున్నాం. ఇది మా సంస్థకి షష్టి పూర్తి ప్రచురణ... అంటే 60 వ ప్రచురణ కావడం కేవలం మా అదృష్టం.

ఈ అపురూపమైన గ్రంథం రూపకల్పన చేసి, ముద్రించి అందించడంలో అనితర సాధ్యమైన సహకారాన్ని అందించిన సుప్రసిద్ధ రచయిత్రి, పత్రికా సంపాదకురాలు, జెవి. పబ్లిషర్స్ అధినేత, అన్నింటినీ మించి ఆత్మీయురాలు అయిన జ్యోతివలబోజుకి మనసారా ధన్యవాదాలు.

భవదీయుడు,

**వంగూరి చిట్టెన్ రాజు**

అధ్యక్షులు

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా,

హ్యూస్టన్, టెక్సస్

చరవాణి: 832 594 9054

ఇ-మైల్: vangurifoundation@gmail.com

# నా 94 సంవత్సరాల మెదడులోని మెరుపులు

**నా** 94 ఏళ్ళ జీవిత చరిత్రలో నా మొదటి జ్ఞాపకమే, కళాధిదేవత, చదువుల తల్లి ఆశీస్సులతో ఆరంభమైంది. 94 ఏళ్ళు వెనక్కి వెడుతున్నా. నేను పుట్టిన ఊరు కాకినాడ. పల్లెటూరి వాతావరణం, పట్నవాసపు పోకడలతో, ప్రాత క్రొత్తల కలయికతో ఓ చిత్రమైన ఊరు. ఆ ఊరే నన్ను చిత్రించి తయారు చేసింది. మా ఊరి ప్రతిబింబాన్ని నేను.

నా మొదటి జ్ఞాపకము - 1925 సం॥ సరస్వతీ గానసభ వారి ఆధ్వర్యంలో, కాకినాడ, ఆంధ్ర సేవా సంఘం హాలులో జరుగుతున్న సంగీతోత్సవాలలో ప్రథమ కచ్చేరీ, వైణిక సార్వభౌములు, పిఠాపురం వాస్తవ్యులు శ్రీ సంగమేశ్వరరావు శాస్త్రి గారి వీణావాద్యానికి నాన్నగారు నన్ను తీసుకువెళ్ళారు. లోపలికి అడుగు పెడుతూంటే హాలు మధ్య, మాకెదురుగా నిలువెత్తు సరస్వతీదేవి బొమ్మ కనపడి, "రా రా" అని అప్యాయముగా పిలుస్తున్నట్టు అనిపించింది. ఎంత అదృష్టం!!!

ఆంధ్ర సేవా సంఘం హాలంతా జనంతో నిండిపోయింది. హాలులో తుంగ చాపలు పరిచారు. మధ్యలో ఒక తివాసీ, దానిపైన తెల్లని పరకాళా దుప్పటి పరిచారు. అదే స్టేజీ, దాని మీద వైణీకులు సంగమేశ్వర శాస్త్రిగారు బాసికపట్టు పెట్టుకొని కూర్చుని, వీణని ఒడిలో పెట్టుకున్నారు. ఆయన ఎదురుగా 6 అడుగుల దూరంలో ముందు కూర్చున్న కృష్ణమాచారిగారి ఒళ్ళో నన్ను కూర్చోపెట్టారు నాన్నగారు. కృష్ణమాచారిగారు ఆంధ్ర సేవా సంఘ స్థాపకుల్లో ఒకరు, గొప్ప

నటులు, గాయకులు, ప్రఖ్యాత నేపథ్య గాయకులు కూడా (సుప్రసిద్ధ నేపథ్య గాయకుడు పి.బి. శ్రీనివాస్ మేనమామ). కచ్చేరీ ఆరంభమయ్యింది.

వీణావాద్యం అంటే, అందరి లాగా మామూలుగానే, ఒక తొడ మీద ఉండాలి, లేదా సరస్వతీ దేవి బొమ్మ పోజులోనైనా ఉండాలి. రెండూ కాకుండా, ఇదేమిటి, ఇలాగ వీణని నిలబెట్టి వాయిస్తున్నారని నా నాలుగున్నర ఏళ్ళ లేత మనస్సుకి ఆశ్చర్యం కలగచేసింది.

శ్రోతలు మంత్రముగ్ధుల్లానే, శిల్పాల్లాగ , చెక్కు చెదరకుండా, సంగీతంలో లీనం అయిపోయారు. కచేరీ ఆఖరులో వాయించిన 'రఘువంశ సుధాంబుధి చంద్రమా' కదన కుతూహలములో, 'నిను వినా నా మది' నవరస కన్నడలో, 'శర శర సమరైక శూర' కుంతలవరాళిలో, వాయిద్యం ecstasies కి వెళ్ళిపోయి రామ రావణ యుద్ధము జరుగుతున్నంత అనిపించింది. (త్యాగరాజ కీర్తనలలో 'రఘువంశ సుధాంబుధి చంద్రమా', 'శర శర సమరైక శూర' వెస్టర్న్ క్లాసికల్ మ్యూజిక్ ప్రభావము ఉన్న బాణీలు. 'శర శర సమరైక శూర' మార్చింగ్ బ్యాండ్ మ్యూజిక్‌లా ఉంటుంది. మొదటి ప్రపంచ యుద్ధము జరుగుతున్నది అప్పుడు. ఆ సందర్భానికి సరిపోయిన కీర్తన.

కచేరి అవగానే నాన్నగారు నన్ను సంగమేశ్వర శాస్త్రి గారి దగ్గరకు తీసుకు వెళ్ళి, కాళ్ళకు నమస్కారం పెట్టించారు. ఆయన ఆశీస్సులు అందుకున్నాక, చిన్నప్పటినుంచీ వెరపెరుగని అనసూయనేమో, తక్షణం ఆయన్నడిగాను. మీరు ఒక వీణ వాయించారు కదా, నాలుగు వీణలను వాయించినట్టు నాదం వచ్చిందేమిటి అన్నాను. "పెద్దలు చెప్పలేని మాటను మీ అమ్మాయి ఒక్క మాటలో చెప్పగలిగింది" అన్నారు కృష్ణమాచారిగారు మా నాన్నగారితో.

90 ఏళ్ళ క్రితమే, వెస్టర్న్ మ్యూజిక్, వాల్ట్జ్ మ్యూజిక్ (Waltz music) నాలుగు తీగల మీద వాయించిన మహానుభావుడు సంగమేశ్వర శాస్త్రిగారు. రవీంద్రనాథ్ ఠాగోర్ గారి వంటి పెద్దలు శాస్త్రిగారిని వరల్డ్ టూర్ తీసుకుని వెళ్ళాలని ప్రయత్నించి విఫలమయ్యారుట అని చెప్పుకునేవారు.

నాకిప్పుడు 94 ఏళ్లు. నా జ్ఞాపకాల చరిత్ర కళాధిదేవత సరస్వతీదేవి కటాక్ష, ఆశీస్సులతో ఆరంభమైన శుభసూచనం. నే వెళ్లవలసిన బోటు, వెళ్ళబోయే బాటకి నాంది పలికి పునాది వేయడం అప్పుడే జరిగింది. ఏదో ఓ తెలియని సంతృప్తి ఆవరించి ఆనందంతో నింపి వేసింది. అదే దేవి నాకిచ్చిన వరబలం.

## నా అక్షరాభ్యాసం

ఆ రోజు నా 5వ పుట్టిన రోజు. ఆ రోజే నా అక్షరాభ్యాసం కూడాను. అమ్మ నాకిష్టమైన పాల పూరీలు చేసింది. నా చెల్లెలు సీతకి బొబ్బట్లు ఇష్టం, నాకివి ఇష్టం. కుంకుమ పువ్వు, జాపత్రి, జీడిపప్పులతో పరమాన్నం లాగా చేసి, అందులో వేయించిన పూరీలు వేస్తారు.

నాకిష్టమైన ఎర్రరంగులో పట్టు పరికిణీ, కంటి మెడ, అర చేతుల చొక్కా వేశారు. నాకు పిరుదులు దాటిన పెద్ద జుట్టు. అత్తయ్య పువ్వుల జడ వేసింది. మంచి ముహూర్తములో చదువు, సంగీతం కూడా మొదలుపెట్టించారు. నా మొదటి సంగీత గురువు, త్యాగరాజు గురువులు శొంఠి రమణయ్య పంతులుగారి పరంపరలోని వారు శొంఠి లచ్చయ్యగారు.

నా మేనత్త ఎప్పుడో చిన్నప్పుడు నేర్చుకున్న హార్మోనియం దులిపి తీసుకు వచ్చారు. లచ్చయ్యగారికి గురు నమస్కారం జరిపాక, ఆయన హార్మోనియం తీసుకుని, “అమ్మాయి సాపాసాలు పట్టు” అని ఆయన పాడారు. నేను “మేష్టారూ, నేనొకసారి వాయించాక పాడతాను, మీరు హార్మోనియం తొయ్యండి” అన్నాను. నాన్నగారూ వాళ్లు “తప్పమ్మా అలా అనకూడదు” అన్నారు.

“బుచ్చిబాబుగారూ (మా నాన్నగారిని అలాగే పిలిచేవారు) చిన్నపిల్లండీ, వాళ్ల మనస్తత్వం గ్రహించి నేర్పించాలి, ఏదీ, అమ్మాయీ వాయించు” అన్నారు.

“నేను రెండు చేతులతో వాయించాలి మీరు తొయ్యండి”, అని లచ్చయ్యగారు హార్మోనియం Bellows తోస్తుంటే, 5 ఏళ్ల నేను తడుముకోకుండా, ఒక్క అపశృతి లేకుండా, ఒక్క స్వరం కూడా తప్పకుండా ‘మురారి దానవ విరామ కేశవ పరాత్పరా’ అంటూ రెండు చేతులతోనూ వాయిస్తూ పాడాను. లచ్చయ్యగారు “అయ్యా, మీ బిడ్డ సామాన్యురాలు కాదు, పుట్టుకతోనే సరస్వతీ కటాక్షంతో పుట్టిన జీనియస్ … ఈ పిల్ల సంగీతంలో పెద్ద పేరు తెచ్చుకుంటుంది, సందేహం లేదు. నా దీవెనలు కూడా అందుకో తల్లీ”, అన్నారు. ‘మురారి దానవ విరామ కేశవ పరాత్పరా’ ఎందుకు వాయించానో తెలియదు. కానీ, ఆ పాట నాటకాలలో నారదుడు పాడేవాడు. నాన్నగారు నాటకాలు రాసేవారు. వేషం వేసేవారు కూడా. ఆ పాటలన్నీ నేను పాడుతూ ఉండేదాన్ని. ‘మురారి దానవ’ బహుశా తేలిగ్గా అనిపించిందేమో వాద్యానికి.

అప్పటినుంచి స్వరాలు, గీతాలు, వర్ణాలు, కీర్తనలు అన్నీ లచ్చయ్యగారు గాత్రంలో చెపుతూంటే నేను ఎవరూ నేర్పకుండానే, నా అంత నేను వాయించు కుంటూనే నేర్చుకునేదాన్ని. అప్పటికే లచ్చయ్యగారు చాలా వృద్ధులు. పైగా నల్లమందు వేసుకుని, ఎప్పుడూ కునికిపాట్లు పడుతుండేవారు. నిద్దర మత్తులో "పాట వచ్చిందా?" అనేవారు. "అది అయిపోయింది, కొత్త పాట నేర్పండి" అనేదాన్ని. క్రొత్తవి నేర్చుకోవటం ఇష్టం. రోజూ నేర్చుకునేదాన్ని. ఇలాగ అపురూపమైన కీర్తనలెన్నో కొన్ని నెలల్లో నేర్చుకున్నాను. అంతే, 6 నెలల్లో లచ్చయ్యగారు మరణించారు. తరవాత వారి కుమారులు శొంఠి సీతారామయ్య గారు మరొక ఏడాది నేర్పారు. తరువాత కొన్నాళ్లు గాప్. నాకు ఆసక్తి కూడా కొంచెం తగ్గింది. దానికి కారణం ఉంది. భావగీతాలు కంపోజ్ చెయ్యటము మొదలుపెట్టాక, ఏ కొత్త రాగం విన్నా ట్యూన్ పెట్టేదాన్ని. జంగమదేవర అనే ఆయన దగ్గర మాండ్ రాగములో, 'సంశయ కామనియా' అనే పాట నేర్చుకున్నాను.

## నేనూ–నా వీణా వాద్యం

నాకు చిన్నప్పటి నుంచీ వీణ కూడా నేర్చుకోవాలని, సరస్వతీదేవి పోజ్‌లో ఫోటో తీయించుకోవాలని ఉండేది. ఆ రోజులలో గురువులు నాకు నేర్పడానికి ఇష్ట పడేవారంటే నమ్ముతారా!? అయితే సెలక్షన్ మాత్రం నాదే.

ఆ రోజులలో పిఠాపురం వీణలు, బొబ్బిలి వీణలు ప్రసిద్ధి. నాన్నగారు నా కోసం మంచి వీణ ఒకటి చేయించి తెచ్చారు పిఠాపురం నుంచి. ఆ రోజు వీణకు పువ్వులు అవీ చుట్టి అలంకరించి, 'కళావతి' అని పేరు పెట్టి, పళ్ళాచారి గారు (ఎత్తుపళ్లు ఉండేవి) వద్ద నేర్చుకోవటానికి సంసిద్ధురాలిని అయ్యాను. నేను కోరుకున్నట్టు ఫోటో కూడా తీయించుకున్నాను. కీర్తనల నుంచే నేర్పాలన్నాను. హార్మోనియం లాగే చిన్న పాటలు వీణపై కూడా వాయించేదాన్ని. అది సరిపోదని తెలుసు. అందుకే గురువు కావాలన్నాను. గురువుగారు 'శ్రీ రామ పాదమా, నీ కృప చాలునే', అమృతవర్షిణి రాగములో నేర్పారు. నన్ను గట్టిగా పాడనిచ్చేవారు కాదు. వీణ వినపడదంటూ, నా గొంతు మాడ్యులేట్ చేసి, నొక్కి పాడాలనేవారు. నాకు గాత్రం ఇష్టం. అలాగ ఫాల్స్ వాయిస్‌లో పాడటము ఇష్టం లేక, వీణ మానేశాను. గాత్రం కోరుకున్నాను. No regrets. నా కళావతికి న్యాయం కూర్చలేకపోయాను కాని, మా ఆవుకి అమృతవర్షిణి అని పేరు పెట్టుకున్నాను.

## రకరకాల సంగీతం

నాకు నచ్చిన గురువు దొరక్క ఓ పెద్ద గాప్ వచ్చింది. హిందుస్తానీ సంగీతం కూడా నేర్చుకోవాలని అనుకున్నాను. అప్పటికే బాలగంధర్వ, నారాయణరావ్ వ్యాస్, జెట్ శంకర్, ఖాదర్ బచ్చా, గంగూబాయి హంగల్, కరీంఖాన్, రోషనార బేగం, వసంత దేశాయి మొదలగువారి కచేరీలు చాలా విన్నాను. నేను నేర్చుకున్నదానికంటే వినికిడి ఎక్కువ. అన్ని గ్రామఫోను రికార్డులు వినేదాన్ని. లతా మంగేష్కర్ తండ్రి దీనానాథ్ మంగేష్కర్, కాకినాడ ప్రముఖుడు, కళాభిలాషి ఎం.వి.శాస్త్రిగారి దగ్గర వున్న రష్యన్ జానపద గీతాలు విన్నా. పిఠాపురం రాజావారి కుటుంబంతో waltz, foxtrot, rhythms విన్నా మన జానపదాలతో, అన్నీ తలొక కాస్త కాస్త అమృతాన్ని అందించాయి.

అందరిలో నుంచి కొంచెం, కొంచెం నాకు అబ్బింది. ఈ రికార్డు వినడానికి శాంతా, శారద, వీరమతులతో ఆడుకోడానికి, పిఠాపుర వాస్తవ్యులు వండిన రుచికరమైన వంటలు తినడానికి, జగన్నాధపురంలో ఉన్న తోటమర్తి వెంకన్న గారింటికి వెళ్ళేదాన్ని. అదే కాకుండా నా టైలర్ కూడా అక్కడే. బొమ్మలు గీసి, రకరకాల డ్రెస్సులు కుట్టించుకునేదాన్ని. శని, ఆదివారాలలో బండీ కట్టించి జాగ్రత్తగా పంపించేవారు నాన్నగారు. మేము వంతెన దగ్గరే దిగిపోయి, అర్ధణా ఇచ్చి బోటులో అవతల పక్క లంక వైపు వెళ్ళేవాళ్లం. ఉప్పుటేరు దాటినట్టు నాన్నగారికి తెలిస్తే ఇంకేమన్నా ఉందా? ఉప్పుటేరులో పడిపోయినట్టు గోలపెట్టేద్దురు.

## మా గురువుగారు

శ్రీరామ సమాజ సంగీతసభ మరియు స్కూలు స్థాపకులు మునుగంటి వెంకట్రావుగారు గురువని విని, మా నాన్నగారు ఆయన వద్దకు తీసుకుని వెళ్లారు. నా అదృష్టం కొద్దీ వారు ఒప్పుకోవడమే కాకుండా, ఇంటికి వచ్చి, సంగీత శాస్త్రంలోని మెళకువలు, దశ విధ గమకాల ప్రయోగాలు, ప్రయోజనాలు, సమాసం విడగొట్టకుండా, భాష చెరపకుండా భావయుక్తంగా పాడడం మొదలైనవి పాడి వినిపించేవారు. ఎక్కువ నేర్పేవారు కాదు. కీర్తనలు మాత్రం నేర్పేవారు. ఆ బాణీయే వేరు. ఆ ట్యూన్స్ ఆయన శిష్యులం మేమే పాడుతున్నాం. నిజమైన సంగీతం అనేది వారి వద్దే నేర్చుకున్నాను. అప్పటికి నిజమైన ఆసక్తి కూడా నాలో పెంపొందింది. కానీ ఏం లాభం? ఎప్పుడూ సరిగ్గా నేర్చుకోవడం పడలేదు.

అప్పటికే నేను లలిత సంగీత కచేరీలు చేస్తున్నాను. బ్రహ్మసమాజ ఉత్సవాల్లో పాడేదాన్ని. మధ్య మధ్య గ్రామఫోన్ రికార్డింగ్స్‌కి మద్రాసు, కలకత్తా వెళ్లడంతో కంటిన్యుయస్‌గా నేర్చుకోవడం పడలేదు. జానపద సేకరణ, అన్నిటి కంటె నా నవ్య సంగీత భావగీతాలని ప్రచారం చేసిన కంటిన్యుయస్ ప్రోగ్రామ్‌ల వల్ల, శాస్త్రీయ సంగీతం రాగం, తానం, పల్లవి దగ్గర ఆగిపోయింది.

## నేనూ, నా హార్మోనియం

హార్మోనియం మీద నాకున్న మక్కువ ప్రపంచంలో మరెవ్వరికీ ఉండదు. ఆ రోజులలో గిన్నీస్ బుక్ ఉండేదో లేదో కానీ, అందులోకి ఎక్కవలసిన విషయం ఇది. హార్మోనియం నా ప్రాణం. తెలుగులో సరియైన మాట దొరకడం లేదు. ఇంగ్లీషులో ఫ్రెండ్ అనొచ్చు. తెలుగులో స్నేహితుడు, స్నేహితురాలు అంటే జెండర్ వస్తుంది. అందుకే నెచ్చెలి అంటాను. నా twin sister అంటాను కూడా.

లచ్చయ్యగారు నాకు అక్షరాభ్యాసంతో, సంగీతాభ్యాసంతో మొదలుపెట్టి, ఎవరూ చెప్పకుండా హార్మోనియం మీద పాట వాయించిన నేను, తర్వాత హార్మోనియంని ఒక్క నిమిషం వదలలేదు నిద్రపోయేటప్పుడు తప్ప. దాని మీద ఎన్నో ప్రయోగాలు చేసేదాన్ని.

ఈ 94 ఏళ్లు నన్ను వదలని ఆత్మీయత నా హార్మోనియంది. నా బంధువులంతా, నన్ను వదిలివేశారామో కాని, నా హార్మోనియం కాదు. నా స్వర రచనలకి తోడ్పడ్డది నా హార్మోనియం. ఎప్పుడైనా ఊపిరి అందక పాడలేకపోతే, నా హార్మోనియం నా బదులు పాడేది – సీత కాదు. హార్మోనియం నా twin sister అని ఎందుకన్నానంటే, నే పెట్టబోయే ట్యూన్‌ని నాకంటె ముందే నా హార్మోనియం అందించేది. నా బ్రెయిన్ దానికే ఉంది. మేము సమఉజ్జీలం. మాకు సమానమైన ఆలోచనలు వస్తాయి.

కళ్లకు గంతలు కట్టుకుని హార్మోనియం రెండు చేతులతో వాయించడం, హార్మోనియంని వెనక్కి తిప్పి వాయించడం, రీడ్స్ మీద గుడ్డ పరచి వాయించడం చేసేదాన్ని. అప్పుడప్పుడు కాలి వేళ్లతో కూడా వాయించడం చేసేదాన్ని. నాన్నగారు చూసి కోప్పడ్డారు. అలాగ చేస్తే సరస్వతీదేవి నన్ను శిక్షిస్తుంది అని చెప్పాక మానేశాను. ఆఖరిసారి ఈ ఫీట్స్ చేసింది రజనీ అన్నయ్యతో పరిచయం అయిన రోజున.

పిఠాపురంలో రంగనాయకుడి లైబ్రరీ ఇంటిలో మామయ్య కృష్ణశాస్త్రి ఉంటున్నప్పుడు, శని ఆదివారాలలో కాకినాడ నుంచి వచ్చి మామయ్య ఇంటిలో గడిపేవాళ్లం.

పిఠాపురంలో ఆ రోజు నేనూ, మేకా ఉష అరుగు మీద కూర్చుని గచ్చకాయ లాడుతున్నాం. ఓ అబ్బాయి చెరుకు గెడ తింటూ, చొక్కా కూడా వేసుకోకుండా లాగూతో వచ్చి, "ఏయ్ అమ్మాయిలూ! ఇక్కడెవరో చిన్నపిల్ల హార్మోనియం కళ్లు మూసుకుని, కళ్లకి గంతలు కట్టుకుని వాయిస్తుందట, ఎవరు?" అన్నాడు. "ఆ పిల్లని నేనే", అన్నాను గొప్పగా. "ఏదీ వాయించు చూద్దాం" అన్నాడు. "లోపలినుంచి హార్మోనియం తీసుకురావాలి కదా! రా" అన్నాను. ఇద్దరం హార్మోనియం అరుగు మీదకు తెచ్చాం. ఓ గుడ్డ తీసుకుని కళ్లకి గంతలు కట్టించుకున్నాను. ఒక పాట అలాగ వాయించాను. మరో పాట హార్మోనియం మీద గుడ్డ కప్పి వాయించాను. వాళ్లిద్దరు తోస్తుంటే, హార్మోనియంని అవతలకి తిప్పి వాయించడం, ఇక నాలుగోది కాలి వేళ్లతో వాయించడం. కాని నాన్నగారి మాటలు జ్ఞాపకం వచ్చి, ఇలాగ కాలితో వాయిస్తే సరస్వతీదేవి శాపం పెడుతుందేమో అని భయమేసి లెంపలు వాయించుకుని, "నీ కోసం వాయించా నబ్బాయ్, ఇంకెప్పుడూ ఇలాగ వాయించను" అన్నాను.

ఆ అబ్బాయి బాలాంత్రపు రజనీకాంత రావు. వెంకట పార్వతీశం కవుల్లో వెంకట్రావుగారి కొడుకు. వీరిల్లు మామయ్య ఇంటి ప్రక్కనే. రజనీ అన్నయ్య నా కంటె కొంచెం పెద్ద. My oldest friend. 88 ఏళ్ల స్నేహం మాది. "రజనీ మామయ్య నీ వైపు బంధువా, నాన్న వైపా?" అని అడిగింది మా రత్నపాప ఒకసారి. మా కుటుంబాలు అంత ఐకమత్యంగా ఉంటాయి.

నా అక్షరాభ్యాసం అయిన కొన్నాళ్లకి, కాకినాడలో మెక్లారిన్ హై స్కూల్ వ్యవస్థాపకులు మెక్లారిన్ దొరగారింట్లో క్రిస్మస్ పార్టీ అయింది. టీచర్ల కుటుంబాలని పిలిచారు. నాన్నగారు నన్నూ, అన్నయ్యనీ తీసుకువెళ్లారు.

పిల్లలూ, పెద్దలూ, ఫలహారాలూ, కేక్‌లూ మొదలైనవి ఆరగించాక, గేమ్స్ ప్రారంభించే ముందు, నా కళ్ల కెదురుగుండా ఓ పెద్ద హార్మోనియం లాగా కనపడింది. తక్షణం వెళ్లి "God save Our Gracious King" అంటూ వాళ్ల పాట వాయించాను. అందరూ లేచి నిల్చున్నారు. మా నాన్నగారు నన్ను

కోప్పడుతున్నట్టు సంజ్ఞ చేశారు. పాటయ్యాక దొరగారు నా దగ్గరకు వచ్చి చార్ట్ లేకుండా ఎలాగ వాయించగలిగావని అడిగారు. నేనింకా ఎన్నో పాటలు వాయించగలనన్నాను. నా చేత నాలుగైదు పాటలు పియానోతో పాడించి నాకు క్రిస్మస్ బహుమతి ఇచ్చారు. హెడ్‌మాస్టర్ ఫాదర్‌గారు అందరికీ కేక్ ఇచ్చారు.

అవింకా సైలెంట్ మూవీల రోజులు. అప్పటి రోజుల్లో ఒక్క సినిమా హాలే ఉండేది. టిక్కెట్లు పావలా కుర్చీ, బేడ (రెండణాలు) బెంచ్, అణా నేల క్లాసు. సినిమా ఆరంభం నుంచీ ఒకరు బెంచ్ క్లాస్ గేట్ దగ్గర కుర్చీలో కూర్చుని రన్నింగ్ కామెంటరీలాగా చెప్పుకుపోయేవారు. అవతల వైపు మరొకరు లెగ్ హార్మోనియం మీద చిన్న చిన్న బిట్స్ వాయించడానికి ప్రయత్నించేవాడు. షో జరుగుతున్నంత సేపూ అదే వాద్యం మళ్లా మళ్లా వాయించేవాడు. సినిమాలో దెబ్బలాటలకి సా గా2 । సా గా2 । సా గా । మ1 గ2 రీ2॥ నీ రీ. బ నీ రీ., నీ రీ. గా। రీ। గ రి సా॥ అనీ, విషాదానికి స రి గ 1। మ1 గ రి । పా, । మా ॥ మ ప ద । ప మ ప । రి గ మ । రి గ మ । స స స । సా ॥ రి గ మ । రి గ మ। స స స । సా ॥ అనీ వాయించేవాడు. నాన్నగారు కుర్చీ టికెట్టు కొన్నా, నేను పరిగెత్తుకు వెళ్లి ఆ హార్మోనిస్ట్ పక్కన నిల్చుని ఎలాగ వాయిస్తాడో గమనించి, ఇంటికెళ్లి అలాగే వాయించేదాన్ని. ఏం లాభం? లెగ్ హార్మోనియం వాయించే సరదా ఇంకా తీరలేదు.

ఏ కచ్చేరీలకు వెళ్లినా, స్టేజీ మీద కూర్చుని పెద్ద గాయకుల ప్రక్కన నాకూ హార్మోనియం వాయించాలని ఉండేది. నన్నెవరు వాయించనిస్తారు? చిన్నపిల్లని కదా! అందుచేత అవకాశం వస్తే వదిలేదాన్ని కాను.

నాన్నగారు నాటకాలు వ్రాసేవారు. వేషాలు వేసేవారు. రిహార్సల్ మా ఇంటిలోనే జరిగేది. వాళ్ల పద్యాలు, పాటలకు హార్మోనిస్టుతో పాటు నేను కూడా వాయించేదాన్ని. నాన్నగారు రాసిన "అనార్కలి" నాటకం డైలాగ్స్‌తో సహా అన్నీ ఎ టు జడ్ యాక్ట్ చేస్తూ పాడేదాన్ని. బి.వి. నరసింహారావు పద్యాలన్నీ, ఆయన కంటే బాగా పాడేదాన్ని – అని ఆయనే అనేవారు.

మా ఇంటిలో నిత్య దీపారాధన జరిగేది. పూజారి వెంకన్న రోజూ పొద్దున్నే వచ్చి పూజ చేసేవారు. అతను మంత్రాలు చదువుతూంటే, వాటితో హార్మోనియం అనుకరించేదాన్ని. వద్దంటున్నా తద్దినం మంత్రాలకి కూడా వాయించి చివాట్లు తినేదాన్ని. దీంతో అయిపోయిందా! రోడ్ మీద పెళ్లి ఊరేగింపు, మేజువాణీ

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Asamana+Anasuya**

* * *